క్లుప్తంగా

వైస్ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి రోజా

నిండ్ర: మండలంలోని అగరం గ్రామ పంచాయతీ వైస్ సర్పంచ్ పురుషోత్తం కుటుంబాన్ని మంత్రి ఆర్కే రోజా ఆదివారం పరామర్శించారు. పురుషోత్తం తండ్రి దేవదాసు శెట్టి ఇటీవల మృతి చెందారు. ఆదివారం మంత్రి ఆగ్రామానికి వెళ్లారు. దేవదాసు శెట్టి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, సర్పంచ్‌లు చెల్లెమ్మ, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి రవి

గంగాధర నెల్లూరు: శాసనసభ ఎన్నికల్లో ఈసారి నియోజకవర్గంలో 4,641 మంది యువత ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి రవి తెలిపారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,01697, మహిళా ఓటర్లు 1,02,966, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నట్లు వివరించారు. నియోజకవర్గంలో 2,04,669 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎన్నికల నియమావళి శనివారం నుంచి అమలులో ఉంటుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు తులసీరామ్, విజయకృష్ణ, ఏఎస్వో షణ్ముగంనాయుడు పాల్గొన్నారు

వెంకటప్ప మందడికి నివాళి



మృతదేహం వద్ద సంతాపం తెలియజేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

విజయపురం : మండలంలోని కేవీపురం గ్రామ ప్రముఖుడు వెంకటప్పమందడి (60) ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రామానికి వెళ్లి మృత దేహంపై పూలమాల వేసి నివాళర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ రజిని, హరినాయుడు తదితరులు ఉన్నారు.

500 మద్యం బాటిళ్ల సీజ్

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పిచ్చాటూరు: మండలంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 500 బాటిళ్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. వెంగళత్తూరు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరి వైపు వెళుతున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో పాండిచ్చేరికి చెందిన 500 మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఆటో సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న జగదీష్, వేలును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో దాడి ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం రాత్రి తెలిపారు. వివరాలు.. మర్రిమంద ఎస్సీ కాలనీకి చెందిన ముసలిపేడు భూలక్ష్మిపై అదే కాలనీకి చెందిన బాలకృష్ణ, హేమలత, చందు, దినేష్, కుమారస్వామి, జగదీష్, నీలమ్మ దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

మండలంలోని కోబాక సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. కోబాక గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు(42) ద్విచక్ర వానంపై ఏర్పేడుకు వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. కోబాక సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుధాకర్ నాయుడుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నగరిలో 'కాలం' మారింది

- టవర్‌క్లాక్‌కు సరికొత్త శోభ
- రోజా చారిటబుల్ ట్రస్ట్ నిధులతో ఆధునికీకరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



సరికొత్త శోభతో టవర్‌క్లాక్

నగరి : పట్టణంలోని టవర్‌క్లాక్‌కు సరికొత్త వన్నె చేకూరింది. రోజా చారిటబుల్ ట్రస్ట్ నిధులు రూ.3 లక్షలతో ఆధునికీకరించారు. ఐదు దబ్బాలకుపైగా టవర్ క్లాక్ పట్టణానికి ల్యాండ్ మార్క్‌గా ఉంది. 1965 నవంబర్ 22వ తేదీన అమెరికా ప్రెసిడెంట్ జాన్ కెనడీ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఈ టవర్‌ను నిర్మించారు. అప్పుడు సర్పంచ్‌గా ఉన్న ఏకే వెంకటరమణ అలియాస్ తంబానాయుడు కెనడీపై ఉన్న అభిమానంతో 40 అడుగుల ఎత్తుతో నాలుగు వైపులా వచ్చేవారికి సమయం తెలిసేలా ఈ టవర్‌ను నిర్మించారు. పలు ప్రాంతాల నుంచి నగరికి చేరుకునే వారు ఎటువైపు వెళ్లాలో నిర్ధారించుకునే చిహ్నంగా ఈ టవర్ మారింది. టవర్ క్లాక్‌కు ఎటువైపు వెళితే వారి బంధువుల ఇళ్లకు చేరుకోవచ్చో గుర్తుకు వచ్చే ల్యాండ్ మార్క్‌గా మారింది. టవర్‌లో ఏర్పాటు చేసిన గడియారంలో చూపే సమయం పనుల నిమిత్తం వెళ్లేవారికి ఆధారంగా ఉండేది. పట్టణంలో ప్రతి సమావేశం ఈ టవర్ క్లాక్ చుట్టూనే జరుగేది. టవర్‌క్లాక్ చుట్టూ అన్ని వ్యవహారాలు ముందుకు కదులుతున్నా కొన్నాళ్ల కిందట టవర్ క్లాక్‌లోని ముళ్లు ముందుకు కదలకుండా ఆగిపోయాయి. నగరి పట్టణానికి పలు రకాలుగా వన్నె చేకూర్చిన మంత్రి ఆర్కేరోజా ల్యాండ్ మార్క్‌గా ఉన్న టవర్ క్లాక్‌పై కూడా దృష్టి సారించారు. పనిచేయక పోవడానికి కారణాలపై ఆరాతీశారు. పాతరకం యంత్రాలు దొరకడం లేదని పలువురు ప్రయత్నించి వదిలేశారని మున్సిపల్ అధికారులు తేల్చేశారు. అయితే మనసుంటే మార్గం ఉంటుందంటూ ప్రత్యేక చొరవ చూపిన మంత్రి ఎలక్ట్రానిక్ పద్ధతిలోకి మార్చి గడియారాలు పనిచేసేలా చేశారు. టైల్స్ అమర్చి ఆధునికీకరించారు. గంట గంటకు బెల్ శబ్దం వినిపించేలా స్పీకర్లు అమర్చారు. తన చారిటబుల్ ట్రస్టు నుంచి ఖర్చు చేసి టవర్‌క్లాక్‌ను అందంగా తీర్చిదిద్దారు. ల్యాండ్ మార్క్‌పై తన మార్కును వేశారు. టవర్‌క్లాక్‌కు కొత్తకళ రావడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణానికి చిహ్నం



క్లాక్ టవర్ నగరి పట్టణానికి చిహ్నం. నగరికి కొత్త వారు ఎవరు వచ్చినా టవర్‌క్లాక్ దగ్గర ఉండండి వచ్చి తీసుకెళ్తాం అంటూ చెబుతారు. లేదా టవర్‌క్లాక్ ఎదురు రోడ్డు, పక్క రోడ్డు అంటూ చిరునామా చెబుతారు. అంతలా నగరిలో టవర్‌క్లాక్ ప్రాధాన్యతను సంతరించుకుంది. అందులో క్లాక్ పనిచేయక పోయినా మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని టవర్ క్లాక్‌ను ఆధునికీకరించిన మంత్రి ఆర్కే రోజాకు ధన్యవాదాలు.

– జ్యోతిప్రకాష్, నగరి

విమర్శకుల నోటికి తాళం



టవర్‌క్లాక్ మరమ్మతులకు గురికావడంతో నాలుగు వైపుల గడియారాలు ఒక్కో సమయాన్ని చూపేవి. ఒకవైపు ఫారిన్ టైమ్ అని, మరోవైపు ఇంకో దేశం టైం అంటూ పలువురు ఎద్దేవా చేసేవారు. సమయం సరిగా చూపని టవర్‌క్లాక్‌కు మంచి సమయం వచ్చింది. మంత్రి ఆర్కేరోజా చొరవతో నేడు చక్కగా పనిచేస్తోంది. ఎద్దేవా చేసేవారి నోటికి తాళం పడింది.

– ఎం. బాబు, బస్టాండ్ ఏరియా, నగరి

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు
- నియోజకవర్గంలో 2,01,541 మంది ఓటర్లు
- ఎన్నికల అధికారి వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ, పక్కన డీఎస్పీ

నగరి : ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి, నియోజకవర్గ సెక్యూరిటీ అధికారి డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో అన్ని పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించామన్నారు. పార్టీ నేతల విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. నగరి నియోజకవర్గంలో 2,01,541 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 98130 మంది పురుషులు, 103403 మంది స్త్రీలు, 8 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. సర్వీసు ఓటర్లు 140 మంది ఉన్నారన్నారు. వడమాలపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, పుత్తూరులో 64, నగరిలో 80, నిండ్రలో 25, విజయపురంలో 29 పోలింగ్ కేంద్రాలు చొప్పున 229 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు, పుత్తూరు పోలింగ్ స్టేషన్లు 52, 68లో 1500 మంది ఓటర్లకు ఉండడంతో రెండు ఆక్సిలరీ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ పార్వత్రిక ఎన్నికలలో 18–19 సంవత్సరాల వయసు కలవారు 5,117 మంది కొత్తగా ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొన కూడదన్నారు. ఎన్నికల ప్రచారాల్లో, ర్యాలీల్లో, సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనకూడదన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

డీఎస్పీ మాట్లాడుతూ పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు మండలాల్లో కవాతు నిర్వహించి హెచ్చరికలు జారీ చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత ఎన్నికల నిర్వహణ కోసం సీఏపీఎఫ్ బలగాల నిఘా, మైక్రో అబ్జర్వర్, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఉంటాయన్నారు. ఎన్నికల సమావేశం, ర్యాలీలు నిర్వహించే పార్టీలు వేదిక, సమయం, ర్యాలీ నిర్వహించే మార్గం వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. సరిహద్దులో ఇప్పటికే పటిష్టమైన భద్రత ఉందని నగదు, ఆభరణాలు పరిమితిలోపే తీసుకెళ్లాలని వాటికి కూడా సరైన బిల్లులు ఉండాలని తెలిపారు.

26 నుంచి బ్యాంకు కార్మికుల సమ్మె

నారాయణవనం : అంచలవారీగా సమ్మెకు దిగనున్నట్లు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉమ్మడి చిత్తూరు, కృష్ణ జిల్లాల్లో దినసరి వేతనానికి పనిచేస్తున్న క్యాజువల్ కార్మికుల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. బ్యాంకు యాజమాన్యం కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ ఈనెల 26వ తేదీ నుంచి దశలవారీగా నిరసన తెలుపుతూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి దిగుతామని తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు శివరాం బాబు, ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆదివారం నారాయణవనంలో మీడియాతో మాట్లాడారు. రోజుకు రూ. 60 నుంచి వేతనం తీసుకుంటూ బ్యాంకు పురోగతికి మెసెంజర్లుగా, అటెండర్లుగా పనిచేస్తున్నామని అన్నారు. కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో యాజమాన్యం అవుట్ సోర్సింగ్ కింద కార్మికులను నియమించుకునేందుకు ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించిందని తెలిపారు. టెండర్లను రద్దు చేసి, ఈనెల చివరిలో కోర్టు ఇవ్వనున్న తీర్పును అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమాజ హితమే బ్రహ్మకుమారి సమాజం లక్ష్యం



మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్

శ్రీకాళహస్తి: సమాజ హితమే లక్ష్యంగా ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం పనిచేస్తోందని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళావేదిక ప్రాంగణంలో రుద్రాక్షలతో తయారు చేసిన శివలింగం, నందీశ్వరుని ప్రతిమలను బ్రహ్మకుమారి సమాజం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచడంతోపాటు రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేస్తోందన్నారు.అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తత అవసరం



డాక్టర్ సతీష్ దేవపట్లకు సత్కారం

తిరుపతి తుడా: నవజాత శిశువుల్లో వచ్చే శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ అన్నారు. రుయా చిన్నపిల్లల ఆసుపత్రిలో ఆదివారం శ్వాసకోశ వ్యాధులపై వైద్యులు, 108, నర్సింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల్లో శ్వాస కోసం వ్యాధుల సమస్య అధికంగా ఉంటాయన్నారు. వాటిని ఆదిలోనే గుర్తించి తగు వైద్యం అందించాలన్నారు. న్యూయార్క్‌లోని వైద్య కళాశాలకు చెందిన నవజాత వైద్య నిపుణుడు డాక్టర్ సతీష్ దేవపట్ల మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పొల్యూషన్, ఆహారపు అలవాట్లతో చంటి బిడ్డల్లోనూ ఈ సమస్య అధికంగా ఉంటుందన్నారు. చిన్న పిల్లల ఆసుపత్రి విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అంకుర హాస్పిటల్ నియోనేటాలజిస్ట్ డాక్టర్ మౌనిక, డాక్టర్ కల్యాన్ చక్రవర్తి, డాక్టర్ రాజేష్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సుకన్య, డాక్టర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- నియోజకవర్గంలో 13 కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థుల సంఖ్య 2,224

మండలం	విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు
గంగాధరనెల్లూరు	615	3
శ్రీరంగరాజపురం	291	2
కార్వేటినగరం	368	2
వెదురుకుప్పం	401	3
పెనుమూరు	385	2
పాలసముద్రం	164	1



పాలసముద్రం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం

పాలసముద్రం : నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ఒక ప్రైవేటు, 5 ప్రభుత్వోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్ల నుంచి టెన్త్ పరీక్షలకు 164 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో 109 మంది బాలికలు, 55 మంది బాలురు ఉన్నారు. పరీక్ష కేంద్రంలోనూ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారితోపాటు 10 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, టేబుళ్లు, విద్యార్థులకు వసతులు కల్పించారు.

మండలాల వారీగా..

గంగాధరనెల్లూరు మండలంలో నెల్లేపల్లి, గంగాధరనెల్లూరు, తూగుండ్రం జెడ్పీ హైస్కూల్, శ్రీరంగరాజపురం మండలంలో కొత్తపల్లిమిట్ట, శ్రీరంగరాజపురం జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం మండలంలో కత్తిరిపల్లి, కార్వేటినగరం జెడ్పీ హైస్కూల్, పెనుమూరు మండలంలో ఉగ్రాణంపల్లె, పెరుమూరు జెడ్పీ హైస్కూల్, వెదురుకుప్పం మండలంలో పచ్చికాపల్లం, వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్, వెదురుకుప్పం జూనియర్ కళాశాల, పాలముద్రం ఉన్నత పాఠశాలతో కలిపి మొత్తం 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో 58 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 2,224 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

అరగంట ముందుగా రావాలి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెన్త్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఆరోగ్య వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా వచ్చి విద్యార్థులు కేటాయించిన గదులను చూసుకోవాలి.

– రాజేంద్రప్రసాద్, ఎంఈఓ , పాలసముద్రం

కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి



పదో తపగతి పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్, అన్ని గదుల్లో హాల్ టికెట్ల నంబర్లు వేశాం . హాల్ టికెట్లపై తప్పకుండా హెచ్ఎంల సంతకం చేయించాలి. 15 నిమిషాల ముందుగానే ఇన్విజిలేటర్లు విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటారు.

– వి.యువరాజ్, డిపార్టుమెంటల్ ఆఫీసర్

కేంద్రం వద్ద 144 సెక్షన్



పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లోకి ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద ఎవరూ గుంపులు గుంపులుగా ఉండకూడదు. పరీక్ష కేంద్రం పరిధిలో అలజడి సృష్టిస్తే చర్యలు తప్పవు. పరీక్ష సమయంలో జిరాక్స్ దుకాణాలు తెరవకూడదు.

– భారతి, ఎస్ఐ, పాలసముద్రం

నా బిడ్డను ఆదరించి గెలిపించండి



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని అభినందిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తన బిడ్డ కళత్తూరు కృపాలక్ష్మిని ఆదరించి గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కేశవరెడ్డి స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయనతోపాటు, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి పాల్గొన్నారు. నారాయణ స్వామి మాట్లాడుతూ తాను డిప్యూటీ సీఎంగా నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జీడీనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కృపాలక్ష్మిని ఆదరించాలని నాయకులను కోరారు. తాను 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎలాంటి స్వార్థ రాజకీయాలు చేయలేదని, ఎల్లప్పుడూ నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించానని చెప్పా రు. అలాంటి కుటుంబం నుంచి రాజకీయ అరంగేట్రం చేస్తున్న తన కుమార్తె కూడా నిస్వార్థంతో సేవలు అందిస్తుందన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ స్థాయి నుంచి పంచాయతీ, మండల, నియోజకవర్గస్థాయి నాయకులందరూ కలిసికట్టుగా కష్టపడి కృపాలక్ష్మని గెలిపించుకుని, సీఎం జగనన్నకు కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, చందురాజు, విశ్వనాథరెడ్డి, వెంకటేష్, ఆనంద్, రాజేంద్రబాబురెడ్డి, దాము రెడ్డి పాల్గొన్నారు.

మీ బిడ్డగా భావించి ఆశీర్వదించండి

గంగాధర నెల్లూరు: రానున్న ఎన్నికల్లో నన్ను మీ బిడ్డగా భావించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆమెను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ రానున్న శాసనసభ ఎన్నికల్లో గతంలో కంటే అత్యధిక మెజారిటీతో కృపాలక్ష్మిని గెలిపించి జగనన్నకు బహుమతిగా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ రెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ రెడ్డి, వరదరాజుల రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

అశోకరాజుకు మాతృ వియోగం



నరసమ్మ(ఫైల్)

నారాయణవనం: స్థానిక సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తల్లి నరసమ్మ(82) శనివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఉదయం స్వగ్రామమైన విజయపురంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మంత్రి ఆర్కే రోజా పరామర్శ



ఆశోక్‌రాజును పరామర్శిస్తున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం : సిద్ధార్థ కళాశాలల చైర్మన్ అశోకరాజును మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. ఆదివారం విజయపురం వెళ్లి అశోకరాజు తల్లి నరసమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, నార్పరాజు, శివరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



బాలక్రిష్ణాపురంలో ఎన్నికల నిబంధనలపై వివరిస్తున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం : ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భారతి తెలిపారు. మండలంలోని బాలక్రిష్ణాపురంలో ఆదివారం గ్రామస్తులతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించే వరకు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజు నచ్చిన పార్టీకి ఓటు వేసుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో మద్యం తాగి గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు అందరూ సహకరించాలని కోరారు.

మళ్లీ జగనన్న విజయం తథ్యం



ఐరాల: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

- సీఎం జగన్ చేసిన మేలు మరవద్దు
- చంద్రబాబును నమ్మితే జన్మభూమి కమిటీలు తెచ్చి దోచేస్తారు
- ఎన్నికల ప్రచార బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి తట్టుకునే శక్తి చంద్రబాబుకు లేదని, ఆయన ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పాతపాళ్యంలో ఆదివారం ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని గుర్తుచేశారు. ముఖ్యంగా పొదుపు మహిళలు, రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టాక మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పారని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. సీఎం జగన్ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేస్తున్న మేలును మరవద్దన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పునాది

సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి, గ్రామ స్వరాజ్యానికి పునాది వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని మంత్రి చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబుకు ఓటేయడం అంటే సంక్షేమం, అభివృద్ధిని వద్దనుకోవడమేనని స్పష్టం చేశారు. చంద్రబాబు మళ్లీ జన్మభూమి కమిటీలు తీసుకొచ్చి దోపిడీ చేయాలనే లక్ష్యంతో గోతికాడ నక్కలా కాచుకుని ఉన్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు లాంటి స్వార్థపరులకు ఓటుతోనే బుద్ధి చెప్పి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో బాబు వస్తే జాబు వస్తుందని ఉన్న జాబులను కూడా ఊడబీకిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చి తరువాత రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించి చరిత్ర తిరగరాశారన్నారు.

ప్రజల సంక్షేమానికి జగన్ కృషి

రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి జగనన్న నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. పిల్లలందరికీ ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో అమ్మఒడి, విద్యాకానుక, తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అభ్యర్థించారు. టీడీపీ నేతల ప్రలోభాలు, మాయమాటలకు మోసపోవద్దని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. జగనన్న ప్రభుత్వంలో ఊహకందని విధంగా అభివృద్ధి చేశామన్నారు. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందుతోందని పేర్కొన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. చంద్రబాబు జీవితమంతా పొత్తులు, అతుకులు, బొంతలు తప్పితే ఏదీ లేదని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజా ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ మోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సుచిత్ర, టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.